
# వృద్ధికి టారిఫ్ దెబ్బ




**ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ అంచనాను తగ్గించిన ఎస్అండ్‌పీ**

- *6.5 శాతం నుంచి 6.3 శాతానికి కోత*
- *ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం*
- *ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి రూపీ పతనం!*

న్యూఢిల్లీ, మే 2: భారత జీడీపీ అంచనాలకు ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను దేశ వృద్ధిరేటు 6.3 శాతంగానే ఉండొచ్చని శుక్రవారం పేర్కొన్నది. ఇంతకుముందు అంచనా 6.5 శాతంగా ఉండటం గమనార్హం. 'ప్రపంచ స్థూల ఆర్థిక వ్యవస్థ సమాచారం: ఆర్థిక వృద్ధిని నెమ్మదింపజేస్తున్న అమెరికా వాణిజ్య విధానంలోని భారీ మార్పులు' పేరిట ఓ నివేదికను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజాగా విడుదల చేసింది. ఈ సందర్భంగానే గతంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి పేర్కొన్న అంచనాలను సవరించింది.

**ట్రంప్ సుంకాల సెగ**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలకు తెరలేపడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. అయితే చైనా మినహా మిగతా దేశాలపై విధిస్తామన్న టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేయడం కొంతలోకొంత ఊరటనిచ్చింది. ఈ క్రమంలోనే భారత్‌సహా ఆయా దేశాలు.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే పనిలోపడ్డాయి. అయినప్పటికీ ఈ ట్రేడ్ వార్‌పై అనిశ్చిత పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉండటంతో.. ఆ సెగ ఇప్పుడు దేశ జీడీపీ అంచనాకు తాకింది. నిజానికి ఈ ఏడాది మార్చిలోనే దేశ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5 శాతంగానే ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంచనా వేసింది. అంతకుముందు ఇది 6.7 శాతంగా ఉంటుందన్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో 0.2 శాతం మేర తగ్గొచ్చని ప్రకటించింది. ఈ లెక్కన చూసుకుంటే జీడీపీ అంచనాకు దాదాపు అర శాతం కత్తెర పడినట్టే అనుకోవచ్చు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) దేశ జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంటున్నది.

**రూపాయి అధోగతే..**

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి దిగజారవచ్చని ఎస్అండ్‌పీ ఈ సందర్భంగా తమ రిపోర్టులో పేర్కొన్నది. ప్రస్తుతం 84.57 వద్ద రూపీ వాల్యూ కదలాడుతుండగా.. 2024 చివర్లో 85.64 వద్ద ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకానైతే రూపాయి మారకం విలువ రూపాయికిపైగానే కోలుకున్నట్టు కనిపిస్తున్నది. అయితే గడిచిన ఈ 4 నెలల్లో తీవ్ర ఒడిదొడుకులనూ చవిచూసింది. ఫిబ్రవరి 6న మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి క్షీణించింది. ఒకానొక దశలో 87.60 స్థాయినీ తాకింది. ఈ నేపథ్యంలో ఎస్అండ్‌పీ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. మళ్లీ రూపాయి ఒత్తిడికి లోనవబోతున్నదన్న సంకేతాలనిస్తున్నది.

**2025-26కుగాను దేశ జీడీపీ అంచనాలకు కోతలు**

| సంస్థ | ప్రస్తుతం | మునుపు |
|---|---|---|
| ఆర్బీఐ | 6.5% | 6.7% |
| ఫిచ్ | 6.4% | 6.5% |
| ఓఈసీడీ | 6.4% | 6.9% |
| ఎస్అండ్‌పీ | 6.3% | 6.5% |
| ప్రపంచ బ్యాంక్ | 6.3% | 6.7% |
| ఐఎంఎఫ్ | 6.2% | 6.5% |
| మూడీస్(2025) | 6.1% | 6.4% |

- ఈ ఏడాది అమెరికా జీడీపీ వృద్ధిరేటు 1.5 శాతంగా, వచ్చే ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చంటున్న ఎస్అండ్‌పీ.
- **చైనా జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది 0.7 శాతం తగ్గి 3.5 శాతానికే పరిమితం కావచ్చు. వచ్చే ఏడాదైతే 3 శాతంగానే ఉండొచ్చని అంచనా.**
- అమెరికాతో సుంకాల సమరానికి బదులుగా చాలా దేశాలు వాణిజ్య ఒప్పందాలనే చేసుకునే వీలుందంటున్న ఎస్అండ్‌పీ.
- **అమెరికా, యూరప్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు సంక్లిష్టం కావచ్చు. కఠిన వైఖరికే మొగ్గుచూపుతున్న కెనడా.**
- పరస్పర ప్రతీకార సుంకాలతో ఏ దేశానికీ లాభం ఉండదంటున్న ఎస్అండ్‌పీ. ఈ తరహా రక్షణాత్మక ధోరణులు మంచివికావని హితవు.



## మళ్లీ పెరిగిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 2: బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా పుత్తడి ధర రూ.96 వేల మార్క్‌ను అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,080 ఎగబాకి రూ.96,800 పలికింది. గురువారం భారీగా తగ్గిన ధరలు మళ్లీ ఆ మరుసటి రోజే పెరగడం విశేషం. స్థానిక ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని ట్రేడర్ వెల్లడించారు. పసిడితోపాటు కిలో వెండి రూ.1,600 ఎగబాకి రూ.97,100 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 23.10 డాలర్లు పెరిగి 3,262.30 డాలర్లకు చేరుకోగా, వెండి 32.49 డాలర్లుగా ఉన్నది.

## ఆడీ కార్లు ప్రియం

న్యూఢిల్లీ, మే 2: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా మరోసారి ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల మాడళ్ల ధరలను రెండు శాతం వరకు సవరిస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతోపాటు ఎక్స్ఛేంజ్ రేట్లలో మార్పులు చోటు చేసుకోవడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

## విక్రయదారులకు అమెజాన్ దన్ను

హైదరాబాద్, మే 2: దేశవ్యాప్తంగా ఉన్న చిన్న స్థాయి విక్రయదారులకు అమెజాన్ శుభవార్తను అందించింది. రూ.300 కంటే తక్కువ ధర కలిగిన ఉత్పత్తులపై రెఫరల్ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో విక్రయదారులు తక్కువ ధర కలిగిన వస్తువులపై గణనీయమైన రీతిలో పొదుపు చేసుకునేందుకు అవకాశం లభించనున్నదని అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ నగలు, గృహోపకరణాలు, వంటగదికి సంబంధించి 135కి పైగా రంగాలకు చెందిన ఉత్పత్తులకు ఈ నిర్ణయం వర్తించనున్నది. తెలంగాణ నుంచి 50 వేల మంది విక్రయదారుల నుంచి సేకరించి తమ ఉత్పత్తులను అమెజాన్‌లో విక్రయిస్తున్నాయి.



## టాప్‌గేర్‌లో క్రెటా విక్రయాలు

న్యూఢిల్లీ, మే 2: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్‌కు చెందిన ఎస్‌యూవీ మాడల్ క్రెటా మరో మైలురాయిని సాధించింది. వరుసగా రెండో నెల ఏప్రిల్‌లోనూ అత్యధికంగా అమ్ముడైన వాహనాల్లో తొలిస్థానంలో నిలిచింది. గత నెలలో 17 వేల యూనిట్ల క్రెటా వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 10 శాతం వృద్ధిని కనబరిచాయి. సంస్థ మొత్తంగా 69,914 యూనిట్ల వాహనాలను విక్రయించగా, వీటిలో ఎస్‌యూవీ వాటా 71 శాతంగా ఉన్నదని పేర్కొంది. ఈ వాహనంపై కస్టమర్లు పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శనమని కంపెనీ సీవోవో, డైరెక్టర్ తరుణ్ గార్గ్ తెలిపారు. క్రెటాతోపాటు వెన్యూ, ఎక్స్‌టర్, అల్కాజర్, ఇతర మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. పదేండ్ల క్రితం దేశీయ రోడ్లపైకి అందుబాటులోకి వచ్చిన ఈ మాడల్‌కు 12 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

## అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లు

- **యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడి**

న్యూఢిల్లీ, మే 2: అమెరికాలో అమ్ముడుకానున్న ఐఫోన్లలో భారత్‌లో తయారైనవే అత్యధికంగా ఉండనున్నాయని యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడించారు. వరుసగా ఏడో త్రైమాసికంలోనూ చైనాలో ఐఫోన్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో సంస్థ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. ఒకవైపు ప్రతీకార సుంకాలు విధిస్తుండటంతో భారత్‌లో తయారవుతున్న ఐఫోన్లను భారీగా దిగుమతి చేసుకోవాలని చూస్తున్నది సంస్థ. జూన్ త్రైమాసికం నాటికి యూఎస్‌లో అమ్ముడుకానున్న అత్యధిక ఐఫోన్లలో భారత్ నుంచి దిగుమతి చేసుకునేవే ఉండనున్నాయని, అలాగే వియత్నాం నుంచి ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచెస్, ఎయిర్‌ప్యాడ్స్ ఉండనున్నాయని చెప్పారు. 2024లో అమెరికాలో 75.9 మిలియన్ల ఐఫోన్లు అమ్ముడయ్యాయి. ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌కు భారత్ నుంచి అత్యధికంగా ఐఫోన్లు ఎగుమతి అవుతున్నాయని, ఫిబ్రవరితో ముగిసిన మూడు నెలలకాలంలో ఎగుమతులు 82 శాతం పెరిగాయని, ఇదే క్రమంలో మార్చి నాటికి 97.6 శాతానికి చేరుకున్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్ తన నివేదికలో వెల్లడించింది. మార్చితో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 90.75 బిలియన్ డాలర్ల నుంచి 95.35 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.



## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 260, నిఫ్టీ 12 పాయింట్ల లాభం




ముంబై, మే 2: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా-భారత్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశాలుండటం, రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లుకావడం మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సూచీలకు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇంట్రాడేలో 900 పాయింట్లకుపైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 259.75 పాయింట్లు అందుకొని 80,501.99 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 12.50 పాయింట్లు పెరిగి 24,346.70 పాయింట్లకు చేరుకున్నది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో అదానీ పోర్ట్ షేరు 4 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫైనాన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, మారుతి, టాటా మోటర్స్, ఐటీసీ, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ముగియగా..నెస్లె, ఎన్టీపీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, టైటాన్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా సర్వీసెస్ 1.67 శాతం అధికంకాగా, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..టెలికం, కన్జ్యూమర్ డ్యూరబుల్, పవర్, యుటిలిటీ, మెటల్, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి.

## సర్కారీ అప్పులు తగ్గాలి

- **అప్పుడే దేశ క్రెడిట్ రేటింగ్ జూమ్**
- **డీఈఏ కార్యదర్శి అజయ్ సేథ్**

న్యూఢిల్లీ, మే 2: దేశ రుణ భారం చాలా ఎక్కువగా ఉందని, ఇది తగ్గాలని.. అప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు భారత క్రెడిట్ రేటింగ్‌ను పెంచుతాయని ఆర్థిక వ్యవహారాల (డీఈఏ) కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. ఈ సర్కారీ అప్పులపై చెల్లించే వడ్డీ భారం కూడా మోయలేనివిధంగా తయారవుతున్నదని, దాన్ని దించుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఐఎస్‌పీపీసీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ కాన్ఫరెన్స్‌లో అజయ్ మాట్లాడుతూ.. అప్పులు పెరుగుతూపోవడం మంచిదికాదన్నారు. రేటింగ్ అప్‌గ్రేడ్ కోసం రేటింగ్ ఏజెన్సీలతో భారత్ ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తోందని వివరించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడానికి మితిమీరిన రుణ భారమేనంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఖర్చులకు సంబంధించి స్పందిస్తూ.. చాలావరకు సమతూకం లోపించిందన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభివృద్ధి కంటే రుణ నిధులను వ్యయాలను పెంచుకోవడానికే వినియోగిస్తున్నాయన్నారు. కాగా, ట్యాక్స్-టు-జీడీపీ రేషియో 20 శాతానికి చేరాలంటే 5-6 ఏండ్లు పట్టవచ్చన్నారు.

## బ్యాంకులపై ఆర్బీఐ భారీ జరిమానా

ముంబై, మే 2: నాలుగు బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ షాకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకుగాను ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతోపాటు మరో రెండు బ్యాంకులపై భారీ స్థాయిలో జరిమానా విధించింది. వీటిలో ఐసీఐసీఐ బ్యాంక్‌పై రూ.97.80 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.61.40 లక్షలు, ఐడీబీఐ బ్యాంక్‌పై రూ.31.8 లక్షలు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రపై రూ.31.80 లక్షల చొప్పున విధించింది. కేవైసీ నిబంధనలు పట్టించుకోకపోవడం, సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్లనే జరిమానా విధించింది.

## నీట్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఖమ్మం, మే 2 : ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఈ నెల 4వ తేదీ ఆదివారం జరిగే ఎన్‌టీఏ నీట్(యూజీ) -2025 పరీక్ష కేంద్రాల వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరిసర ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు.

**ఖమ్మంలో పరీక్షా కేంద్రాలివే..**

1. ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, ఎన్టీఆర్ సర్కిల్, ఇల్లెందు రోడ్డు, ఖమ్మం.
2. ప్రభుత్వ హైస్కూల్, శాంతినగర్, చర్చికంపౌండ్, మిషన్ హాస్పిటల్ సమీపం, ఖమ్మం.
3. ప్రభుత్వ హైస్కూల్, ఎన్ఎస్పీ కాలనీ, ఎన్ఎస్టీ రోడ్, నిర్మల్ హృదయ్ స్కూల్ సమీపం, ఖమ్మం.
4. ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, రాధాకృష్ణ బ్లాక్, రైల్వేస్టేషన్, ఖమ్మం
5. యూనివర్శిటీ పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్, ఎన్టీఆర్ సర్కిల్, ఇల్లెందు రోడ్డు, ఖమ్మం.
6. కేంద్రీయ విద్యాలయం, కరుణగిరి సమీపం, పోలేపల్లి, ఖమ్మంరూరల్

## బిల్లొచ్చింది.. ఇల్లివ్వం..!

**నిరుపేదలతో సర్కారు దోబూచులాట**

**గతంలో ఇండ్ల బిల్లు తీసుకున్నారని కొత్త మంజూరు నిలిపివేత**

**ఆందోళన చెందుతున్న నిరుపేద కుటుంబాలు**

ఇల్లెందు, మే 2: మాది ప్రజా ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలకు గూడు కల కలగానే మిగిలిపోయింది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాటలన్నీ నీటిమూటలయ్యాయి. కొత్త ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకొని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న నిరుపేదలను ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసేందుకు కొర్రీలు పెడుతూ నానా ఇబ్బందులు పెడుతున్నది. మండలానికి ఒక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసి.. అక్కడ ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పిన ప్రభుత్వం దరఖాస్తులు సైతం స్వీకరించింది. అర్హులకు ఇండ్లు ఇస్తామని చెప్పిన అధికారులు నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించడంతో నిరుపేదలు ఉన్న గుడిసెలను తొలగించుకొని కొత్త ఇల్లు నిర్మించుకోవాలనే ఆతృతలో ఉన్నారు. జాబితాలో మీ పేరున్నా గతంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించి కొన్ని బిల్లులు తీసుకున్నారని, దీంతో ఇల్లు మంజూరు కాలేదని, ఆన్‌లైన్ జాబితా నుంచి మీ పేరు తొలగిపోయిందని అధికారులు చెప్పడంతో నిరుపేదలు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమకు ఇంటి నిర్మాణం కలగానే మిగిలిపోయిందని ఆవేదన చెందుతున్నారు.

**గత లబ్ధిదారులకు కొత్త చిక్కులు**

బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందు ఇందిరమ్మ ఇల్లు వస్తుందనే ఆశతో కొందరు నిరుపేదలు ఇంటి నిర్మాణాలను ప్రారంభించారు. అయితే అప్పటి ప్రభుత్వం సరైన సమయంలో బిల్లులు ఇవ్వకపోవడంతో చేసేది లేక నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేశారు. ఆ స్థలంలోనే కొందరు గుడిసెలు వేసుకోగా.. మరికొందరు రేకులు వేసుకుని నివాసం ఉంటున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు కట్టిస్తామని చెప్పడంలో వారిలో మళ్లీ ఆశలు చిగురించాయి. ఇండ్లు లేని నిరుపేదలు, రేకుల షెడ్లు ఉన్న వారికే తొలి ప్రాధాన్యత అన్న ప్రభుత్వం ఇప్పుడు కొత్త మెలికలు పెట్టడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంతో సంబంధం లేకుండా అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం తొలగించిన పాత ఇల్లు

**గతంలో ఇల్లు నిర్మించలేకపోయాం..**



నా పేరు గొగ్గెల రమాదేవి. మాది టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామం. మాకు గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని అధికారులు చెప్పడంతో నిర్మాణ పనులు ప్రారంభించాం. అప్పుడు బిల్లులు సరిగా రాకపోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. ప్రస్తుత ప్రభుత్వంలో మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని అధికారులు వచ్చి చెప్పారు. మళ్లీ ప్రారంభించిన పనులను అధికారులు వచ్చి నిలిపివేయాలని చెప్పారు. గతంలో మీకు ఇల్లు మంజూరైనందున ఆన్‌లైన్‌లో మీ పేరు చూపడం లేదని తెలిపారు. మాకు చాలా బాధగా ఉంది. గతంతో సంబంధం లేకుండా ఇల్లు మంజూరు చేయాలి.

**ఉన్న రేకుల ఇల్లు తొలగించుకున్నాం..**



నా పేరు ఎర్రగడ్డ లింగయ్య. మాది టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామం. గతంలో ఇందిరమ్మ ఇల్లు వచ్చినప్పటికీ పనులు ప్రారంభించినా మధ్యలోనే నిలిచిపోయాయి. చిన్న రేకుల షెడ్డు వేసుకొని ఉంటున్నాం. మళ్లీ ఇంటి కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నా. ఇటీవల అధికారులు మా ఇంటికి వచ్చి నీకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది..నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకోమని చెప్పారు. ఉన్న రేకుల షెడ్లను తొలగించాను. తీరా అధికారులు వచ్చి మీరు ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. మీరు గతంలో ఇంటి బిల్లు తీసుకున్నట్లు ఉందని చెప్పారు. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

## విపత్తు నష్ట నివారణకు ముందస్తు కార్యాచరణ

**కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**




మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం, మే 2 : విపత్తుతో ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు కష్టం కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. గ్రామస్థాయి నుంచి అధికారులు, ఆపదమిత్ర, ఫిషర్‌మెన్, ఈతగాళ్లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సమాచారం అందిపుచ్చుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమైన డాక్యుమెంట్లు, విలువైన సామాగ్రిని 15 జూన్ నుంచే ప్యాకింగ్ చేసుకొని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే తరలింపునకు సిద్ధంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కేంద్రాల్లో 1077 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని సూచించారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్డీవో సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి

ఖమ్మం, మే 2 : భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో రూ.249.5 కోట్లతో భూగర్భ డ్రైనేజ్ పనులను అమృత్ 2 పథకం కింద మంజూరయ్యాయని, వాటిలో రూ.189 కోట్ల 50 లక్షలు భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణం, రూ.60 కోట్లు రాబోయే 10 సంవత్సరాలకు వాటి నిర్వహణకు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో ఆశించిన పురోగతి లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన రైతు నాయకులు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కొణిజర్ల, మే 2: మండలంలోని లక్ష్మీపురం వద్ద కొనుగోలు కేంద్రంలో రైతులు 20 రోజులుగా ధాన్యాన్ని అమ్మేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం లక్ష్మీపురంలోని ధాన్యం కొనుగోలు కేందాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐకేపీ సంస్థ వెంటనే ధాన్యం కొనుగోలు చేసి, బస్తాల రవాణాకు తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చింతపల్లి ప్రసాద్, బానోత్ హరిచంద్, కావూరి సత్యనారాయణ, జట్ల రవికుమార్, ధరావత్ నంద్యానాయక్, ధరావత్ నర్సింహారావు, కొచ్చర్ల భిక్షం పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలపై వినతి

ఖమ్మం అర్బన్, మే 2 : ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్‌టీయూ జిల్లా ఆధ్వర్యంలో జడ్పీ సీఈవో దీక్షారైనాని కలిసి వినతిపత్రం అందజేశారు. జడ్పీ జీపీఎఫ్ ఖాతాల్లో 2022 మార్చి నుంచి ఇంట్రెస్ట్ క్రెడిట్ కాకపోవడం, మూడు సంవత్సరాలు ఖాతాల నిర్వహణ సరిగా లేకపోవడం వంటి సమస్యలను వివరించారు. యలమద్ది వెంకటేశ్వర్లు, కట్టా శేఖర్‌రావు, తాళ్లూరి చంద్రశేఖర్‌రావు, రత్నకుమార్, లింగం సతీష్ పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

బోనకల్లు, మే 2: ఫార్మర్ రిజిస్ట్రీ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంపై వీడియా కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ డైరెక్టర్ బీ.గోపి వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా మాస్టర్ ట్రైనర్ సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయచంద్ర మాట్లాడుతూ ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ రైతులకు సులువుగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లాలోని రైతులు మొబైల్ యాప్ ద్వారా కానీ, వెబ్‌పోర్టల్ ద్వారా కానీ వ్యవసాయ విస్తరణ అధికారులు వారి క్లస్టర్ పరిధిలో గల అన్ని గ్రామాల్లో క్యాంపును చేపట్టడం జరుగుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారులు పీ.వినయ్‌కుమార్, ఎస్.మానస, కే.సాయిదీక్షిత్, టీ.వేణయాదవ్, బీ.సాయిశివ, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఎప్‌సెట్

ఖమ్మం అర్బన్, మే 2: ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఎప్‌సెట్‌లో భాగంగా శుక్రవారం ఇంజినీరింగ్ పరీక్ష నిర్వహించారు. ఖమ్మం, సత్తుపల్లి ప్రాంతాల్లో పరీక్షలు జరిగాయి.

## మార్కెట్ ఆదాయం పెంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న కమిటీ చైర్మన్

మధిర, మే 2: మధిర వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు మార్కెట్ కార్యదర్శి చంద్రశేఖర్‌తో కలిసి మార్కెట్ కమిటీ 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసిన సందర్భంగా ఆదాయ వ్యయాల రికార్డులను శుక్రవారం పరిశీలించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం అధిక ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కార్యదర్శిని ఆదేశించారు.

## కళాశాలలను సందర్శించిన ఇంటర్ అబ్జర్వర్

ఖమ్మం అర్బన్, మే 2: ఇంటర్మీడియట్ డిప్యూ టీ సెక్రటరీ, జిల్లా అబ్జర్వర్ సీహెచ్ యాదగిరి రెండ్రోజులుగా ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నారు. జిల్లాలోని పలు కళాశాలలను తనిఖీ చేస్తున్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో కళాశాలలు సాధించిన ఉత్తీర్ణత శాతాన్ని తెలుసుకుంటూ, రెమిడియల్ తరగతులను పరిశీలిస్తున్నారు. సప్లమెంటరీలో పూర్తిస్థాయిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని ప్రిన్సిపాల్స్‌కి సూచించారు. శుక్రవారం సైతం పలు కళాశాలలను సందర్శించగా ఆయన వెంట డీఐఈవో రవిబాబు ఉన్నారు.

## ఆర్టీసీ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ




పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

మధిర, మే 2: ఈ నెల 7వ తేదీ నుంచి జరుగే సమ్మెను జయప్రదం చేయాలని ఖమ్మం రీజియన్ జేఏసీ చైర్మన్ పిల్లి రమేశ్ ఆధ్వర్యంలో మధిర బస్ డిపో ఎదుట శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ట్రేడ్ యూనియన్‌లపై ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. 2017 సంవత్సరం వేతన సవరణ బకాయిలు చెల్లించాలని కోరారు. కొత్త అలవెన్స్‌లు అమలు చేస్తూ రిటైర్డు అయిన ఉద్యోగులకు 2017 వేతన సవరణ జరిగి అన్ని బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిమ్మినేని రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే.అరుణకుమారి, సహాయ కార్యదర్శి ఎం.రామచంద్రరావు, రీజియన్ నాయకులు లాజర్, మధిర డిపో అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.గోపాలరావు, జేవీ.కృష్ణారావు, సభ్యులు పాల్గొన్నారు.